


# రిలీవింగ్ ఆర్డర్స్

■ కొచిరాజు శేషగిరిరావు

శ్రీ శ్రీ శ్రీ కేశవులు ఎం.ఎస్‌సి. ఫిజిక్స్ గారికి ఇంటరు బోర్డువారు దయ:తో ప్రాక్టికల్స్ ఎగ్జామినర్‌గా అపాయింట్‌మెంట్ ఆర్డరు పంపించినా ౨. దానిని దయతో కాలేజి ఎగ్జామినేషన్ సెక్రెటరీ కేశవులుకు ఇచ్చి కంగ్రాచ్యులేషన్స్ చెప్పి, కాఫీ తాగినాడు. దానితో కేశవులుకు ఏనుగు నెక్కినంత, లేక క్రొత్త స్కూటరు ఎక్కినంత సంతోషం కలిగింది.

మరునాడు కాలేజీకి రాగానే ప్రాక్టికల్ ఎగ్జామినర్‌గా ప్రక్క ఊరికి బయలుదేరడానికి ఎడమకాలు (లెఫ్ట్) పైకి ఎత్తి మనసులో మార్చ్ అనుకొని వెలో అని బయటికి అన్నాడు. ఆ మాట విన్న కొలీగ్ "గురూ! నీవు మార్చ్ అంటే కాదు. రిలీవింగ్ ఆర్డరు సంపాదించాలి!" అని సలహా ఇచ్చాడు.

'ఓ అదెంతసేపు' అనుకుంటూ కేశవులు కాగితం చేతపట్టి రెండు ముక్కలు ఇంగ్లీషులో గీచి, ధనధనా ప్రిన్సిపాల్ దగ్గరకు పోయి అప్లికేషన్ రిలీవింగ్ ఆర్డరుకు పెట్టాడు.

(అయ్యా! ఇది ఉపోద్ఘాతము)

ప్రిన్సిపాల్: మిస్టర్ కేశవులు ! మీకు ఎగ్జామినర్‌గా ఆర్డర్ రావటం చాలా సంతోషం. కాని మీకు అపాయింట్‌మెంట్ వచ్చినట్లుగా సాక్ష్యం పెట్టాలి.

కేశవులు: ఇంకేమి కావాలి సార్! నేను అప్లికేషన్ ఇస్తున్నాను కదా!

ప్రి: ఆహా, మీమీద నమ్మకం లేక కాదండి. మీరు ఎగ్జామినేషన్ బ్రాంచివారి సంతకం దానిమీద తీసుకునిరండి ప్లీజ్.

* * *

కేశవులు: అయ్యా! పరీక్షల సెక్రెటరీగారూ! ఈ అప్లికేషన్ మీద మీ సంతకం వెయ్యండి.

సెక్రెటరీ: సారీ సార్! నేను తాళం చేతులు ఇంటిదగ్గిర మరచి వచ్చినాను. మధ్యాహ్నం తెస్తాలెండి. పోనీ మీకు ఇచ్చిన ఆర్డరు కాపీ వుంది కదా! దాని జిరాక్స్ పెట్టండి సరిపోతుంది.

* * *

కేశవులుగారు తన శిష్యులలో ఒకనికి రూపాయి ఇచ్చి, వానిని బతిమాలి బామాలి జిరాక్స్ కాపీ తెప్పించి దానిని అప్లికేషన్‌కు జతపర్చి ప్రిన్స్‌పాల్ దగ్గరికి పోయాడు.

ప్రిన్సిపాల్: థ్యాంక్స్ కేశవులుగారు. మీవంటి సిన్సియర్స్‌ను చూస్తే నాకు చాలా సంతోషం. బెస్ట్ ఆఫ్ లక్. అయ్యో ఈ జిరాక్స్ కాపీ మీద గజిటెడ్ సంతకం లేదే. పోనీండి నేను చేస్తాను. మిమ్ములను నమ్మకుంటే ఎట్లా. ఇది తీసుకెళ్ళి ఆఫీసులో ఇచ్చెయ్యండి.

కేశవులు: థాంక్స్ సార్. థాంక్స్!

* * *

కేశవులు: అయ్యా! ఎల్.డి.సి. గారు నాకు రిలీవింగ్ ఆర్డర్స్ కావాలి. ఇదిగో నా అప్లికేషన్.

ఎల్.డి.సి: ఏంసార్! మీరు మమ్మల్నిట్లా సతాయిస్తే బాగుండదు. మీరు మీ ఒక్కరి పని చేసుకొంటారు. మేము మీ అందరి సంగతి చూడాలి.

కేశవులు: ఇప్పుడు ఏమైనదండీ! నా అప్లికేషన్ తీసుకోండి.

ఎల్.డి.సి: ఇది ప్రొసీజర్ కాదు. మీరు అప్లికేషన్ నాకిస్తే నే పోగొడితే ఎట్లా! మీరు ప్రొసీజర్ నేర్చుకోవాలె. మాటిమాటికి చెప్పాలంటే మాకు ఎట్లా కుదురుతుంది.

కేశవులు: మరి దానిని ఏమి చెయ్యమంటారండి.

ఎల్.డి.సి: దానిని ఇన్‌వార్డు సెక్షన్లో ఇచ్చెయ్యండి. దానిని ఎంట్రీ చేసుకొని మాకు పంపిస్తాడు.

* * *

కేశవులు: మిస్టర్ మల్లయ్యా! ఈ అప్లికేషన్ ఇన్‌వార్డు చేసుకోండి.

మల్లయ్య: సార్! నాపని చూడండి. 15 రోజుల నుండి ఇదంతా పెండింగ్‌లో వుంది. ఇవి ఎంట్రీ చేసుకొని తర్వాత మీ అప్లికేషన్ ఇన్‌వార్డు చేసి పంపిస్తానండి.

కేశవులు: అంతవరకంటే ఎట్లయ్యా! నేను రేపే ఎగ్జామినర్‌గా పోవాలి.

మల్లయ్య: వీలైనంత త్వరగా పూర్తి చేస్తా. రెండు మూడు గంటలలో మీ అప్లికేషన్ ఇన్‌వార్డు చేసి పంపిస్తాను. మీరు క్లాసుకుపోయి రండి.

* * *

మల్లయ్య: సార్! కేశవులుగారు- మీ అప్లికేషన్ ఇన్‌వార్డు చేసి పంపించాను.

కేశవులు: థాంక్యూ! ఎక్కడికో పోతున్నారు.

మల్లయ్య: కాంటీన్‌కు. మీరు వస్తున్నారనుకొంటాను.

కేశవులు: సరే. పదండి...

*   *   *

కేశవులు: అయ్యా! ఎల్.డి.సీ.గారు నమస్కారం. నా అప్లికేషన్‌ఫారం...

ఎల్.డి.సి: మీరు మాటిమాటికీ రావద్దండి సార్. అన్నీ ప్రొసీజర్ ప్రకారం చేస్తుంటాము. చూడండి ఇన్ని కాగితాలున్నాయి. అవన్నీ విడిచి మీ కాగితం చూడడం, ప్రయారిటీ ఇవ్వడం నా మతానికే విరుద్ధం. అన్నీ లెక్కప్రకారం జరుగుతాయి. మీరు డిస్టర్బ్ చేయకుంటే ఒక గంటసేపటిలో మీ పని పూర్తవుతుంది.

కేశవులు: నేను రేపు ఉదయం బస్సుకు పోవాలండి.

ఎల్.డి.సి: మీరట్లా మాట్లాడొద్దు సార్. నేను నా పని సక్రమంగా చేస్తాను. కావాలంటే ప్రిన్సిపాల్‌కు రిపోర్టివ్వండి. నన్ను డిస్టర్బ్ చెయ్యొద్దు.

*   *   *

ఎల్.డి.సి: కేశవులుగారు! మీ కాగితం యు.డి.సి.కి ఫార్వర్డ్ చేశాను బాబూ! 3 గంటలు కాకముందే నేను వర్క్ ఫినిష్ చేసినాను.

కేశవులు: అయితే! నా ప్రొసీడింగ్ ఆర్డర్ తీసుకోవచ్చా!

ఎల్.డి.సి: అబ్బే నా దగ్గరెక్కడుంది. యు.డి.సి.గారి నడగండి.

*   *   *

కేశవులు: అయ్యా! యు.డి.సి.గారు నమస్కారం.

యు.డి.సి: రండిసార్! మీ కాగితమే చూస్తున్నాను. అన్నీ కరెక్ట్‌గా వున్నాయి. చూడండి ఇప్పుడే మీ కాగితం ఆర్డరు వ్రాయడానికి పంపిస్తాను. అక్కడ కూర్చోండి.

*   *   *

ఎల్.డి.సి: చూడండి సార్! మీరు మాటిమాటికి నన్ను ఇట్లా డిస్టర్బ్ చేస్తుంటే నేను పని ఎట్లా చేసేది. ఈ వర్కంతా పెండింగ్‌లో వుంది.

యు.డి.సి: అట్లంటే ఎట్లయ్యా! అర్జన్సీ చూడాలి. ఈయన రేపు ఉదయమే వెళ్ళిపోవాలి కదా! కొంచెం చూడు.

*   *   *

ఎల్.డి.సి.గారు డ్రాఫ్ట్ రాసి, యు.డి.సి. గారికి చూపించి, దాని అప్రూవల్ సంతకం కొరకు ప్రిన్సిపాల్ గారి వద్దకు తీసుకొని పొయ్యాడు పాపం.

*   *   *

ప్రిన్సిపాల్: సరే! ఇవి టైప్ చేయిస్తావా! ఎన్ని కాపీలు కావాలి?

ఎల్.డి.సి: ఏమోసార్, నాకు ఈ అప్లికేషన్ ఒకటే వచ్చింది. ఎన్నికావాలో యు.డి.సి. గారిక తెలుసేమో.

ప్రిన్సిపాల్: యు.డి.సి. గారిని పిలవండి.

*   *   *

యు.డి.సి. గారు ఎగ్జామినేషన్ సెక్రెటరీని పిలిపించారు. అందరు కలిసి ఎస్టిమేట్స్ తయారుచేసి 20 కాపీలు కావలెనని నిర్ణయించారు. అవన్నీ కలిపి టైపిస్ట్ దగ్గరికి పోయాయి. టైపిస్ట్ కాగితాలు, కార్బన్ పేపర్లు లేవని వాటిని టైప్‌రైటర్ నెత్తిన కొట్టాడు. గడియారం ఐదుగంటలు కొట్టింది. ●

